క్లుప్తంగా

భక్తిశ్రద్ధలతో గౌరీ నోములు

కొలిమిగుండ్ల: కార్తీక మాసం మూడో సోమవారం సందర్భంగా భక్తిశ్రద్ధలతో గౌరీ నోములు చేసుకున్నారు. కొందరు ఆలయాల్లో.. మరికొందరు ఇళ్లలో నోములు నోచుకున్నారు. కొలిమిగుండ్లలోని లలితా సుందరేశ్వర స్వామి ఆలయంలో సామూహిక గౌరీ నోములు నోచుకున్నారు. వేదపండితులు ఆలూరి రాఘవేంద్ర ప్రసాద్ నోముల ప్రాముఖ్యతను కథ రూపంలో వినిపించారు. మూడో సోమవారం కావడంతో శివాలయాలు భక్తులతో రద్దీగా మారాయి. మహిళలు కార్తీక స్నానాలు చేసి దీపాలు వెలిగించారు.

నేటి నుంచి అయ్యప్పస్వామి దీపోత్సవం

కోవెలకుంట్ల: పట్టణంలోని గాంధీనగర్‌లో వెలసిన హరిహర అయ్యప్పస్వామి ఆలయంలో మంగళవారం నుంచి దీపోత్సవ కార్యక్రమం నిర్వహించనున్నట్లు నిర్వాహకులు తెలిపారు. కార్తీక మాసాన్ని పురస్కరించుకుని మొదటి రోజు గణపతిపూజ, పుణ్యాహవచనం, రక్షాబంధనం, అఖండ దీపస్థాపన, వాస్తు, మండపారాధన, అంకురార్పణ, 20వ తేదీ అష్టాభిషేకం, విళక్కిపూజ, కుందూనది నుంచి కలశాలతో నీరు తెచ్చి అయ్యప్పస్వామికి అభిషేకం, కేరళవారి శింగారి మేళతాళాలతో స్వామివారి గ్రామోత్సవం ఉంటుందన్నారు. 21న పడిపూజ కార్యక్రమం ఉంటుందని పేర్కొన్నారు.

జాబ్‌మేళాలో 21 మందికి ఉద్యోగాలు



పాలిటెక్నిక్ కళాశాల ప్రిన్సిపాల్ రాజేష్

బేతంచెర్ల: రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో బేతంచెర్ల ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలో సోమవారం నిర్వహించిన జాబ్ మేళాలో 21 మందికి ఉద్యోగాలు లభించినట్లు జిల్లా అడిషనల్ స్కిల్ డెవలప్‌మెంట్ అధికారి హరిత, ప్రిన్సిపాల్ రాజేష్ తెలిపారు. మొత్తం 42 మంది అభ్యర్థులు హాజరైనట్లు చెప్పారు. డైకిన్ ఇండియా లిమిటెడ్, సోనోవిజన్ ఐఎఫ్ఎంఎస్ ప్రైవేట్ లిమిటెడ్ సంస్థల ప్రతినిధులు అభ్యర్థులను ఇంటర్వ్యూ చేసి ఉద్యోగాలకు ఎంపిక చేశారన్నారు.

బ్యాంకు ఖాతాలకు ఎన్‌పీసీఐ లింక్ తప్పనిసరి



సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీడీఓ

బేతంచెర్ల: ప్రభుత్వ సంక్షేమ పథకాలు వర్తించాలంటే ప్రతి ఒక్కరూ తమ బ్యాంకు ఖాతాకు ఆధార్‌తో పాటు ఎన్‌పీసీఐ లింక్ కలిగి ఉండాలని ఎంపీడీఓ ఫజుల్ రహిమాన్ అన్నారు. సోమవారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో నగర పంచాయతీ కమిషనర్ హరిప్రసాద్, ఏఓ కిరణ్ కుమార్, ఆయా శాఖల అధికారులతో సమావేశం నిర్వహించారు. లబ్ధిదారులు తప్పనిసరిగా బ్యాంకుల్లో ఎన్‌పీసీఐ లింకేజీ చేయించుకోవాలని తెలిపారు. ఒకవేళ బ్యాంకు ఖాతా లేకపోతే పోస్టాఫీసులో ఎన్‌పీసీఐ లింక్‌తో కొత్తగా అకౌంట్ ఓపెన్ చేసుకోవాలని సూచించారు. తద్వారా ప్రభుత్వ సంక్షేమ పథకాల నగదు నేరుగా లబ్ధిదారుల ఖాతాలో జమ అవుతుందన్నారు.

విద్యుత్ తీగలు తగిలి వరిగడ్డి దగ్ధం



కాలిపోయిన వరి గడ్డి

బేతంచెర్ల: మండల పరిధిలోని బైనపల్లె గ్రామంలో విద్యుత్ తీగలు తగిలి ట్రాక్టర్ వరిగడ్డి దగ్ధమైంది. బైనపల్లె గ్రామానికి చెందిన నరసింహులు పాణ్యం మండల కొనిదేడు గ్రామంలో సోమవారం రూ.15 వేలకు వరిగడ్డి కొనుగోలు చేసి ట్రాక్టర్‌లో గ్రామానికి తరలిస్తున్నాడు. గ్రామ సమీపంలోకి రాగానే విద్యుత్ తీగలు తగిలి మంటలు చెలరేగాయి. డ్రైవర్ అప్రమత్తమై ట్రాలీ లిఫ్ట్ ఎత్తి గడ్డిని కిందకు తోసేయడంతో పెను ప్రమాదం తప్పింది. వరిగడ్డి కాలిపోవడంతో రూ. 15 వేల నష్టం జరిగినట్లు రైతు నరసింహులు తెలిపాడు.

క్రీడలతో మానసికోల్లాసం



పోటీలను ప్రారంభిస్తున్న గ్రంథాలయాధికారి

బేతంచెర్ల: విద్యార్థులు చదువుతోపాటు క్రీడల్లో పాల్గొనడం వల్ల మానసిక ఉల్లాసం కలుగుతుందని గ్రంథాలయ అధికారి మధుశేఖర్ అన్నారు. సోమవారం పట్టణంలోని ధరణి టౌన్‌షిప్పులో జెడ్పీ హైస్కూల్ విద్యార్థులకు కబడ్డీ, పరుగు పందెం పోటీలను నిర్వహించారు. పీఈటీ రంగనాయకులు పాల్గొన్నారు.

సంక్షోభ వసతి గృహాలు

- సంక్షేమ హాస్టళ్లలో సౌకర్యాల లేమి
- శిథిలావస్థకు చేరుకున్న కోవెలకుంట్ల ఎస్సీ బాలికల హాస్టల్
- తాగునీటికి తప్పని ఇక్కట్లు
- హాస్టళ్ల సంక్షేమాన్ని పట్టించుకోని కూటమి ప్రభుత్వం
- ఇబ్బందులు పడుతున్న విద్యార్థులు



బనగానపల్లెలో ప్రహరీ లేని బాలికల వసతిగృహం

కోవెలకుంట్ల: సంక్షేమ హాస్టళ్లలో సమస్యలు విలయతాండవం చేస్తున్నాయి. మౌలిక సదుపాయాలు లేక వసతి గృహాలు సంక్షోభంలో కూరుకుపోయాయి. విద్యా సంవత్సరం ప్రారంభమై ఆరు నెలలు కావస్తున్నా కూటమి ప్రభుత్వం సంక్షేమ హాస్టళ్లను పట్టించుకోకపోవడంతో విద్యార్థులు సమస్యలతో సతమతమవుతున్నారు. సంక్షేమ హాస్టళ్ల దుస్థితిపై రాష్ట్ర అత్యున్నత న్యాయస్థానం రెండు రోజుల క్రితం తీవ్ర ఆందోళన వ్యక్తం చేసింది. హాస్టళ్లలో తరుచూ ఆందోళన కలిగించే ఘటనలు జరుగుతున్నాయని పేర్కొంది. హాస్టల్ భవనం చుట్టూ సోలార్ ఫెన్సింగ్ ఏర్పాటు చేయాలని, అవసరమైన చోట సీసీ కెమెరాలు పెట్టాలని ప్రభుత్వానికి పలు మార్గదర్శకాలను సూచించింది. ఈ నేపథ్యంలో బనగానపల్లె నియోజకవర్గంలోని ఐదు మండలాల పరిధిలో హాస్టళ్ల స్థితిగతులపై సోమవారం సాక్షి పరిశీలనలో పలు అంశాలు వెలుగులోకి వచ్చాయి.



ధ్వంసమైన కోవెలకుంట్ల ఎస్సీ బాలికల వసతి గృహం ప్రహరీ

శిథిలావస్థ భవనమే గతి

కోవెలకుంట్ల పట్టణంలోని వెలగటూరు రస్తాలో ఉన్న ఎస్సీ బాలికల వసతి గృహంలో ఉంటూ 75 మంది విద్యార్థినులు పట్టణంలోని బాలికోన్నత, పేట స్కూళ్లల్లో చదువుతున్నారు. హాస్టల్ భవనం శిథిలావస్థకు చేరుకుని కూలేందుకు సిద్ధంగా ఉంది. పెచ్చులూడి పడుతుండడంతో రెండు గదులను మూసి వేశారు. హాస్టల్‌కు ఏర్పాటు చేసిన ప్రహరీ పూర్తిగా దెబ్బతింది. కొత్త భవనం నిర్మించాలని ప్రతిపాదనలు పంపినా ఇంత వరకు నిధులు మంజూరు కాకపోవడంతో తాత్కాలికంగా ప్రైవేట్ భవనంలో నిర్వహించాలని ఉన్నతాధికారులు ఆదేశాలు జారీ చేశారు. హాస్టల్‌కు ఇంత వరకు సీసీ కెమెరాలు అమర్చలేదు. విద్యార్థులకు మంచినీటిని అందించే మినరల్ వాటర్‌ప్లాంట్ పనిచేయకపోవడంతో హాస్టల్ సమీపంలో ఉన్న పంచాయతీ మినరల్ వాటర్‌ప్లాంట్ ద్వారా నీటిని సరఫరా చేస్తున్నారు. సెప్టెంబర్ నుంచి విద్యార్థినులకు కాస్మోటిక్ చార్జీలు ఇవ్వడం లేదు. హైస్కూల్ విద్యార్థినులకు నెలకు రూ.130, ప్రైమరీ విద్యార్థినులకు రూ. వంద చొప్పున అందజేయాల్సి ఉంది.

బాలికలకు రక్షణ కరువు

బనగానపల్లె యాగంటి రహదారిలోని బీసీ బాలికల కళాశాల వసతి గృహంలో ఇంటర్ నుంచి డిగ్రీ వరకు 60 మంది విద్యార్థినులు ఉన్నారు. ఈ వసతి గృహంలో మరుగుదొడ్లు, స్నానపు గదులకు తలుపులతో పాటు టైల్స్ దెబ్బతిన్నాయి. వసతి గృహం చుట్టూ ప్రహరీ లేకపోవడంతో విద్యార్థినులు భయాందోళనకు గురవుతున్నారు. వసతి గృహంలో బోరు సౌకర్యం లేకపోవడంతో గ్రామ పంచాయతీ ఏర్పాటు చేసిన నీటి పథకం ద్వారా నీటిని సరఫరా చేస్తున్నారు. సొంత బోరు ఏర్పాటు చేయాలని ఉన్నతాధికారులకు వసతి గృహ అధికారి చైతన్యలక్ష్మి నివేదిక అందజేశారు. నిత్యావసరాలు, కూరగాయలకు సంబంధించి ఆరు నెలల నుంచి బిల్లులు పెండింగ్‌లో ఉన్నాయి.

వేధిస్తున్న తరగతి గదుల కొరత

కొలిమిగుండ్ల కస్తూర్బా పాఠశాలలో ఆరో తరగతి నుంచి ఇంటర్ వరకు 220 మంది చదువుతున్నారు. తరగతి గదుల కొరత ఉండడంతో విద్యార్థినులు ఇబ్బందులు పడుతున్నారు. గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ హయాంలో నాడు–నేడు కింద అదనపు తరగతి గదుల నిర్మాణం చేపట్టగా ప్రస్తుతం పనులు మధ్యలోనే ఆగిపోయాయి. మధ్యాహ్న భోజన సమయంలో విద్యార్థినుల సంఖ్యకు తగ్గట్టుగా డైనింగ్ హాల్ లేకపోవడంతో వరండాలో కూర్చొని తినాల్సి వస్తోంది. విద్యార్థినులకు సరిపడా మరుగుదొడ్లు లేవు. ఆరేళ్ల నుంచి రెగ్యులర్ ఎస్ఓ లేకపోవడంతో ఇన్‌చార్జ్ ఎస్ఓలే దిక్కయ్యారు. సీసీ కెమెరాలు ఏర్పాటు చేయలేదు.

భోజనంలో లోపించిన నాణ్యత

అవుకు కస్తూర్బా గాంధీ బాలికల హాస్టల్‌లో మెనూ ప్రకారం భోజనం అందుతున్నా నాణ్యతా ప్రమాణాలు పాటించడం లేదు. విద్యార్థినులు అర్ధాకలితో అలమటిస్తున్నారు. మనబడి నాడు–నేడు పనుల్లో భాగంగా నిర్మించాల్సిన అదనపు తరగతి గదుల నిర్మాణ పనులు ఆగిపోయాయి. పాఠశాల చుట్టూ కాంపౌండ్ వాల్ పనులు పూర్తి కాలేదు. విద్యార్థినులు రాత్రి వేళల్లో నిద్రించే గదులు సరిపోక ఇబ్బందులు పడుతున్నారు. పాఠశాల ఎస్ఓ విద్యార్థినులతో దురుసుగా ఉంటుందన్న ఆరోపణలు ఉన్నాయి.

పనిచేయని వాటర్ ప్లాంట్

సంజామల కస్తూర్బా గాంధీ హాస్టల్‌లో మినరల్ వాటర్‌ప్లాంట్ పనిచేయకపోవడంతో బయటి నుంచి వాటర్‌క్యాన్లను కొనుగోలు చేసి విద్యార్థినులకు సరఫరా చేస్తున్నారు. పాఠశాలలో సీసీ కెమెరాలు పనిచేయడం లేదు. డైనింగ్ హాలు లేకపోవడంతో భోజనం చేసేందుకు ఇబ్బందులు పడుతున్నారు.

కొరవడిన ‘సంక్షేమం’

డోన్: నియోజకవర్గంలోని సంక్షేమ వసతి గృహాల్లో సరైన వసతులు లేకపోవడంతో విద్యార్థులు అవస్థలు పడుతున్నారు. పలు వసతి గృహాలు శిథిలావస్థకు చేరుకున్నాయి. పలు చోట్ల గదుల కొరత, మరుగుదొడ్లు,నీటి సమస్యలు నెలకొన్నాయి. ప్రహరీ, సీసీ కెమెరాలు లేకపోవడంతో విద్యార్థినులకు భద్రత కరువైంది. కనీస సౌకర్యాలు కూడా లేకపోవడంతో విద్యార్థులు వసతి గృహాల్లో ఉండేందుకు ఇష్టపడడం లేదు.

ప్యాపిలిలో..

ప్యాపిలి ఎస్సీ బాలికల వసతి గృహంలో అరకొర సౌకర్యాలు ఉండడంతో 110 మంది విద్యార్థినులకు సీట్లు కేటాయించినా కేవలం 70 మంది మాత్రమే హాస్టల్లో ఉన్నారు. దశాబ్దాల క్రితం నిర్మించిన ఈ వసతి గృహం కనీసం మరమ్మతులకు నోచుకోకపోవడంతో భవనం శిథిలావస్థకు చేరుకుంది. ఆర్వో ప్లాంట్ మూలన పడడంతో కొళాయి నీరు తాగి తరుచూ అనారోగ్యానికి గురవుతున్నారు.

డోన్‌లో..

పట్టణంలో ఉన్న నాలుగు వసతి గృహాలు శిథిలావస్థకు చేరుకున్నాయి. మరుగుదొడ్లు, బాత్‌రూంలు అపరిశుభ్రంగా ఉండడంతో దుర్గంధం వ్యాపిస్తోంది. బాలికల బీసీ వసతి గృహంలో 300 మందికి మాత్రమే సరిపోయే వసతి ఉండగా 380 మంది ఉంటున్నారు. 10 మందికి ఒక బాత్ రూం, లెట్రిన్ ఉండాల్సి ఉండగా కేవలం 18 మాత్రమే ఉన్నాయి. 12 బాత్‌రూంలు, మరుగుదొడ్లు శిథిలావస్థకు చేరుకోవడంతో విద్యార్థినుల బాధలు వర్ణనాతీతం. బోర్లలో నీరు అడుగంటిపోవడంతో అరకొరగా వచ్చే నీరు సరిపోవడం లేదు. గదుల కొరత వేధిస్తోంది. బీసీ బాలుర వసతి గృహానికి ఇంత వరకు ట్రంకు పెట్టెలు, ప్లేట్లు సరఫరా చేయలేదు. కూటమి ప్రభుత్వం ఆరు నెలల నుంచి వసతి గృహాల నిర్వాహణకు నిధులు మంజూరు చేయకపోవడంతో విద్యార్థులకు అవస్థలు తప్పడం లేదు.

అంతులేని నిర్లక్ష్యం

బేతంచెర్లలో బాలుర, డోన్‌లో జ్యోతిరావుపూలే, అంబేడ్కర్ బాలబాలికల వసతి గృహాలకు నూతన భవనాలు నిర్మించకపోవడంతో అవుట్‌డోర్ స్టేడియంతో పాటు అద్దె భవనాల్లో తరగతులు నిర్వహిస్తున్నారు. డోన్‌లోని జ్యోతిరావు పూలే వసతి గృహానికి ప్రహరీ, సెక్యూరిటీ లేకపోవడంతో విద్యార్థినులకు రక్షణ కరువైంది.



డోన్‌లో శిథిలావస్థకు చేరుకున్న మరుగుదొడ్లు



డోన్: బాలికల వసతి గృహం గదుల్లో స్థలం సరిపోక వరండాలోనే ఉంచిన ట్రంకు పెట్టెలు



పెచ్చులూడిన ప్యాపిలి ఎస్సీ బాలికల వసతి గృహం



ప్యాపిలిలో పనిచేయని ఆర్వోప్లాంట్



డోన్: ఎస్సీ బాలుర వసతి గృహంలో ఫ్యాన్ దుస్థితి

స్కూల్ కాదు సచివాలయమే!



సచివాలయ ఉద్యోగుల సీట్‌లో పిల్లలు

డోన్ టౌన్: ఈ చిత్రంలో ఉన్నది డోన్ పట్టణంలోని గాంధీ నగర సచివాలయం. ఉద్యోగులు ఎవరూ లేకపోవడంతో అక్కడ ఖాళీ స్థలంలో ఆడుకోవడానికి వచ్చిన పిల్లలు సచివాలయంలోకి వెళ్లారు. ఉద్యోగుల రీతిలో ఫీల్ అవుతూ హాయిగా కుర్చీలో కూర్చొన్నారు. పలు ఫైళ్లను తెరగేశారు. ప్రస్తుతం ఈ ఫొటోలు పట్టణంలో వైరల్ అవుతున్నాయి. సచివాలయ ఉద్యోగులు రోజు అటెండెన్స్ రిజిస్టర్‌లో సంతకాలు చేయడం ఆ తర్వాత ఎవరికి వారు సొంత పనులపై బయటకు వెళ్లడం వల్లే ఈ పరిస్థితి తలెత్తిందని స్థానికులు చర్చించుకుంటున్నారు. ప్రజలకు అందుబాటులో ఉండడం లేదనే ఆరోపణలు ఉన్నాయి.

రైతులకు అందుబాటులో ఉండాలి



సిబ్బందితో మాట్లాడుతున్న ఏఓ సుధాకర్‌రెడ్డి

సంజామల: గ్రామ వ్యవసాయ సహాయకులు రైతులకు అందుబాటులో ఉంటూ సాగులో ఎప్పటికప్పుడు సలహాలు, సూచనలు ఇవ్వాలని మండల వ్యవసాయ అధికారి సుధాకర్ రెడ్డి అన్నారు. సంజామల రైతు సేవా కేంద్రంలో సోమవారం విలేజ్ అగ్రికల్చర్ అసిస్టెంట్స్‌తో సమీక్ష సమావేశం నిర్వహించారు. రబీ సీజన్‌లో వేసిన పంట నమోదు కార్యక్రమం త్వరితగతిన పూర్తి చేయాలని సూచించారు. శనగ రూ.84, వరి–రూ.126, జొన్న–రూ.60, మినుము–రూ.48 బీమా ప్రీమియం రైతులే చెల్లించాలని తెలిపారు.

వృత్తి విద్యలో పట్టు సాధిస్తే మెరుగైన అవకాశాలు



ఇండస్ట్రియల్ విజిట్‌లో విద్యార్థులు

అవుకు: విద్యార్థులు వృత్తి విద్యలో రాణిస్తే మెరుగైన ఉపాధి అవకాశాలు ఉంటాయని ఆదర్శ పాఠశాల ప్రిన్సిపాల్ హెమీమా అన్నారు. సోమవారం వృత్తి విద్యలో భాగంగా విద్యార్థులు అవుకు విద్యుత్ సబ్‌స్టేషన్‌ను సందర్శించారు. విద్యుత్ సరఫరాను ట్రాన్స్‌కో ఏఈ పక్కీరయ్య విద్యార్థులకు వివరించారు. అలాగే ఎలక్ట్రానిక్ అండ్ హార్డ్‌వేర్‌లో పలు విషయాలను తెలుసుకున్నారు. వైస్ ప్రిన్సిపాల్ మునీంద్ర, ఉపాధ్యాయుడు నరేంద్ర తదితరులు పాల్గొన్నారు.

కరాటేలో డోన్ విద్యార్థి ప్రతిభ

డోన్ టౌన్: విజయవాడలోని చెన్నుపాటి రామకోటయ్య ఇండోర్ స్టేడియంలో ఈ నెల 17వ తేదీ జరిగిన సోర్ట్స్ కరాటే చాంపియన్‌షిప్ పోటీల్లో డోన్ విద్యార్థి లౌక్య ప్రతిభ చాటినట్లు కరాటే మాస్టర్ రమణ తెలిపారు. అసోసియేషన్ ప్రెసిడెంట్ మిల్టన్ శాస్త్రి చేతుల మీదుగా ప్రశంసా పత్రాన్ని అందుకున్నట్లు చెప్పారు.

సీపీఎం పట్టణ కార్యదర్శిగా శ్రీకాంత్

డోన్ టౌన్: సీపీఎం పట్టణ కార్యదర్శిగా నక్కి శ్రీకాంత్‌తో పాటు 13 మంది కమిటీ సభ్యులను ఏకగ్రీవంగా ఎన్నుకున్నట్లు ఆ పార్టీ జిల్లా కార్యదర్శి రమేష్‌కుమార్, జిల్లా కార్యవర్గ సభ్యుడు నాగరాజు తెలిపారు. సోమవారం స్థానిక కార్యాలయంలో వీరి ఎన్నిక జరిగింది. సీపీఎం నాయకులు కొండన్న, శివరామ్, రామాంజనేయులు, కొయిలకొండ నాగరాజు, చిన్న రహిమాన్, ఎల్లయ్య పాల్గొన్నారు.

పుస్తక పఠనంతో విజ్ఞానం



బనగానపల్లె: విద్యార్థులకు వ్యాసరచన పోటీలు

బనగానపల్లె రూరల్: పుస్తక పఠనంతో జ్ఞానాన్ని పెంచుకోవచ్చని బనగానపల్లె గ్రంథాలయశాఖ అధికారి బషీర్ అహ్మద్ అన్నారు. జాతీయ గ్రంథాలయ వారోత్సవాల్లో భాగంగా సోమవారం పట్టణంలోని పలు ప్రభుత్వ ఉన్నత పాఠశాలల్లో విద్యార్థులకు వ్యాసరచన పోటీలు నిర్వహించారు. చిన్నతనం నుంచే పత్రికలు, కథల పుస్తకాలు, ప్రముఖుల జీవిత చరిత్ర చదవడం వల్ల మంచి పౌరులుగా రాణిస్తారన్నారు. వ్యాసరచన పోటీల్లో ప్రతిభ చాటిన వారికి ఈ నెల 20వ తేదీ బహుమతులు అందజేస్తామని తెలిపారు.

కోవెలకుంట్ల: గ్రంథాలయాలను సద్వినియోగం చేసుకుని జ్ఞాన సముపార్జన పొందాలని లైబ్రేరియన్ బాలతిమ్మారెడ్డి సూచించారు. గ్రంథాలయ వారోత్సవాలను పురస్కరించుకుని సోమవారం పట్టణంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు గ్రంథాలయాల ప్రాముఖ్యతపై వ్యాసరచన పోటీలు నిర్వహించారు. ప్రతిభ చాటిన విద్యార్థులకు వారోత్సవాల ముగింపు రోజున బహుమతులు ప్రదానం చేస్తామన్నారు. తెలుగు ఉపాధ్యాయులు సుధీర్, తిరుపతిరెడ్డి పాల్గొన్నారు.

అవుకు: విద్యార్థులు పుస్తక పఠనాన్ని అలవర్చుకోవాలని గ్రంథాలయ ఇన్‌చార్జ్ రామదాసు అన్నారు. అవుకు జిల్లా పరిషత్ బాలుర, బాలికల ఉన్నత పాఠశాల విద్యార్థులకు గ్రంథాలయాలతో కలిగే ప్రయోజనాలను వివరించారు. అనంతరం వ్యాసరచన, చిత్రలేఖనం, క్విజ్, పరుగుపందెల పోటీలను నిర్వహించారు. హెచ్‌ఎం చెన్నకేశ్వరమ్మ, ఉపాధ్యాయులు సుమలత, కుమారి, సుబ్బలక్ష్మి, దాక్షాయణి పాల్గొన్నారు.



యాగంటిలో నందిశ్వరుడిని దర్శించుకుంటున్న భక్తులు



యాగంటిలో కార్తీక దీపాలు వెలిగిస్తున్న భక్తులు



కోవెలకుంట్ల: పంచముఖ సిద్ధేశ్వరస్వామి ఆలయంలో..

మహాదేవునికి నీరాజనాలు

- శైవ క్షేత్రాల్లో విశేష పూజలు
- పోటెత్తిన భక్తులు



ముచ్చట్ల మల్లికార్జున స్వామికి పూజలు చేస్తున్న భక్తులు

బనగానపల్లె రూరల్: కార్తీక మాసం మూడో సోమవారం సందర్భంగా యాగంటి ఉమా మహేశ్వర స్వామి ఆలయం భక్తులతో కిక్కిరిసింది. వివిధ ప్రాంతాల నుంచి అధిక సంఖ్యలో తరలివచ్చిన భక్తులు ముందుగా ఆలయ పెద్ద కోనేరులో కార్తీక స్నానాలు చేశారు. ప్రధాన గోపురం వద్ద ఉన్న ధ్వజ స్తంభం వద్ద కార్తీక దీపాలు వెలిగించారు. ఉమామహేశ్వరస్వామి, నందీశ్వరుడికి పూజలు చేశారు. కాగా కోనేరులో భక్తులు కార్తీక సాన్నాలు చేసేందుకు తగినంత నీరులేకపోవడంతో ఇబ్బందులు పడ్డారు.

కోవెలకుంట్ల: మండలంలోని శివాలయాలు శివనామస్మరణతో మార్మోగాయి. పట్టణంలోని గాంధీ సెంటర్‌లో వెలసిన శివాలయం, నాగలింగేశ్వర స్వామి, పాటిమీద శివాలయం, మారెమ్మ ఆలయం, ఏడుకొప్పెర్లబావి సమీపంలోని శివాలయాలు భక్తులతో పోటెత్తాయి. భక్తులు అధిక సంఖ్యలో ఆలయాలకు చేరుకుని ప్రత్యేక పూజలు చేసి మొక్కులు తీర్చుకున్నారు. అలాగే భీమునిపాడు పద్మనాభ స్వామి ఆశ్రమంలో వెలసిన పంచబ్రహ్మలింగేశ్వరస్వామి, గుళ్లదూర్తి, కలుగొట్ల, బిజనవేముల, రేవనూరు, సొదరదిన్నె, తదితర గ్రామాల్లో కార్తీక పూజలు జరిగాయి.

అవుకు: స్థానిక కాశీవిశ్వనాథ ఆలయంలో వేకువజాము నుంచే భక్తులు దీపాలు వెలిగించి మొక్కులు తీర్చుకున్నారు. స్వామివారికి అభిషేకాలు చేశారు. పట్టణంలోని బలరామేశ్వరస్వామి ఆలయంలో అలంకరించిన స్వామివారి చిత్రం ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది.



అవుకు: కాశీవిశ్వనాథస్వామి ఆలయంలో దీపాలు వెలిగిస్తున్న భక్తులు

బేతంచెర్ల: మండలంలోని హెచ్ కొట్టాలలో వెలసిన ముచ్చట్ల భ్రమరాంబ, మల్లికార్జునస్వామి, యంబాయి రామలింగేశ్వరుడు, బైనపల్లె, ముసలాయి చెర్వు, రహిమానుపురం గ్రామాల్లోని విశ్వేశ్వర స్వామి, సిమెంట్‌నగర్‌లోని జీవ బుగ్గ లింగేశ్వర స్వామి, గోర్లగుట్టలోని బుగ్గరామేశ్వరస్వామి, పూదోట మఠంలోని భేతేశ్వరస్వామి, దుర్గాపేటలో వెలసిన సిద్ధేశ్వరస్వామి ఆలయాల్లో విశేష పూజలు చేశారు. మహిళలు కార్తీక దీపాలు వెలిగించారు.

యాగంటిలో మాజీ ఎమ్మెల్యే కాటసాని పూజలు

బనగానపల్లె: కార్తీక మాసం మూడో సోమవారాన్ని పురస్కరించుకుని యాగంటిలో మాజీ ఎమ్మెల్యే కాటసాని రామిరెడ్డి, కాటసాని జయమ్మ దంపతులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. వారికి ఆలయ అర్చకులు స్వాగతం పలికారు. ఆలయ ప్రాంగణంలో దీపాలు వెలిగించి ఉమామహేశ్వరస్వామిని దర్శించుకున్నారు. అనంతరం బసవన్న గోశాలను సందర్శించి గోవులకు ఆహారాన్ని అందించారు.



యాగంటిలో పూజలు చేస్తున్న కాటసాని రామిరెడ్డి దంపతులు

వర్గీకరణ పేరుతో చిచ్చుపెట్టడం సరికాదు



నిరసన వ్యక్తం చేస్తున్న మాలమహానాడు నాయకులు

బనగానపల్లె రూరల్: ఎస్సీ వర్గీకరణ పేరుతో ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు మాల, మాదిగల మధ్య చిచ్చుపెట్టడం మంచిది కాదని మాలమహానాడు రాష్ట్ర ఉపాధ్యక్షుడు కేడం సుబ్బారాయుడు అన్నారు. ఇటీవల కూటమి ప్రభుత్వం అసెంబ్లీలో వర్గీకరణ బిల్లు పెట్టడంపై మాలమహానాడు నాయకులు సోమవారం బనగానపల్లె పెట్రోల్ బంకు కూడలి వద్ద నిరసన తెలిపారు. సుబ్బారాయుడు మాట్లాడుతూ..వర్గీకరణను తాము తీవ్రంగా వ్యతిరేకిస్తున్నట్లు తెలిపారు. వర్గీకరణ వల్ల మాలలకు అన్యాయం జరుగుతుందన్నారు. ప్రభుత్వం ఈ నిర్ణయాన్ని మార్చుకోవాలని కోరారు. మాల మహానాడు నాయకులు చిన్నరాయుడు, శిఖామణి, భాస్కర్, వెంకటేశ్వర్లు, హుస్సేని, ప్రసాద్, రాజు తదితరులు పాల్గొన్నారు.